అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 29 జూన్ 2023

రెండో విడత గొర్ల పంపిణీ పరిశీలన



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని హంగర్గ గ్రామంలో రెండవ విడతలో భాగంగా ఇటీవలే పంపిణీ చేసిన గొర్రెల ఆరు యూనిట్లను జిల్లా వెటర్నరీ అధికారి డా. సింహరావ్ , డిస్ట్రిక్ డైరెక్టర్ సంజీవ్ కులకర్ణి, జుక్కల్ వెటర్నరీ డాక్టర్ పండరినాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి సింహరావ్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండో విడుతలో పంపిణీ చేసిన ఆరు యూనిట్ల లబ్దిదారులు గొర్రెలకు పోషక ఆహారం అందించి లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలమణి హన్మండ్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివాజీ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవనానికి శంకుస్థాపన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో బుధవారం ముదిరాజ్ సంఘ భవనానికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణం తొందరగా పనులు పూర్తి చేయాలని మున్సిపాలిటీ పరిధిలో ప్రతి సంఘానికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. కొన్ని సంఘాల నాయకులు ఇప్పటికే పనులు ప్రారంభించారని వీటికి స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం నేడు భూమి పూజ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, ఏ ఈ వినోద్. ముదిరాజ్ సంఘ నాయకులు, నారాయణ ముదిరాజ్ ,వెంకటేశం ముదిరాజ్, పేలాల రాములు ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, పోచయ్య సాయి కుమార్, నర్సింలు పాల్గొన్నారు.





కలెక్టరేట్‌లో ధర్నా చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను ఈడ్చుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు

ఎస్‌ఎఫ్‌ఐ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- సమస్యల పరిష్కారానికి విద్యార్థుల పట్టు
- కలెక్టరేట్ గేటు ముందు బైఠాయింపు
- పోలీసులు, విద్యార్థి నాయకుల మధ్య తోపులాట
- విద్యార్థులను ఈడ్చేసిన పోలీసులు
- పలువురు అరెస్టు
- నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు
- ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



కలెక్టరేట్ ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. సమస్యలు పరిష్కరించే వరకు కదిలేది లేదని భీష్మించుకోవడంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ప్రతిసారీ వినతిపత్రాలు సమర్పించడమే తప్ప సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధిగా లేదని విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వాలని భీష్మించారు. కలెక్టరేట్ గేటు వద్ద రాకపోకలు అడ్డుకుని పెద్దఎత్తున నినదించారు. ఈ సమయంలో పోలీసులకు, విద్యార్థులకు వాగ్వాదం జరిగింది. కలెక్టరేట్ నుంచి వెళ్లకపోతే కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులను ఈడ్చేశారు. బలవంతంగా అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రయివేటు స్కూళ్లలో ఫీజులు తగ్గించి, ప్రభుత్వ స్కూళ్లలో వసతులు పెంచాలని, యూనివర్శిటీలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం బుధవారం చలో కలెక్టరేట్ చేపట్టింది. ఈ ఆందోళనకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి హాజరయ్యారు. వందలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించి నినాదాలు చేశారు. 'వద్దురా నాయనా.. కేసీఆర్ పాలన' 'మారిందన్నారురో.. ఏమిటి మారిందిరో' 'మారిందన్నోడికి సిగ్గేందుకు లేదురో' అంటూ నినాదాలు చేశారు. సుమారు గంటపాటు కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయలేదని అన్నారు. మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. స్కూళ్లలో టీచర్ల కొరత ఉందని, ఎంఈఓలు లేరని చివరకు స్కావెంజర్లను కూడా సర్కారు నియమించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యూనివర్శిటీలను నీరుగారుస్తూ ఇష్టారీతిన ప్రయివేటు వర్సిటీలకు అనుమతి ఇస్తున్నారని విమర్శించారు. ఇటీవల గురునానక్ అనే ప్రయివేటు యూనివర్శిటీ అడ్మిషన్ల పేర లక్షలు వసూళ్లు చేసి 4 వేల మంది విద్యార్థులను రోడ్డునపడేసిందని గుర్తు చేశారు. ఇక కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నూతన విద్యావిధానం పేర కుల, మతాల మధ్య విద్వేషం నింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెలోషిప్‌లను నిలుపుదల చేస్తూ ఇబ్బందుల పాల్జేస్తున్నారని అన్నారు. పేదోడికి, ఉన్నోడికి విద్యలో అసమానతలు తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు వినతిపత్రం సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. విద్యార్థుల సమస్యలపై నిక్కచ్చిగా పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై అణిచివేత, నిర్బంధం చేస్తున్నారని అన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే నలుగురు వచ్చి వినతిపత్రం సమర్పించి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీనిపై నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిసారీ వినతులు సమర్పిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని, కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ప్రధాన గేటు మూసివేశారు. అయినప్పటికీ.. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు విద్యార్థులను ఈడ్చేశారు. అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, నగర కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నాయకులు విశాల్, యూనివర్శిటీ బాధ్యులు ప్రసాద్, సంధ్య, ఛత్రు, జోహార్‌సింగ్, సందీప్, శైలజ, నీలిమతో పాటు పలువురు విద్యార్థులున్నారు.

మండవకు మొండిచేయి



- ఆయన అనుచరల్లో నిరాశ
- లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరిక
- స్వయంగా మండవ ఇంటికి కేసీఆర్
- పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంతో అసంతృప్తి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా రూరల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి గడ్డుకాలం నడుస్తోంది. మొన్నటి వరకు బీఆర్ఎస్ వెంట ఉన్న అరికెల నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇక క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ.. రూరల్ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే మండవ వెంకటేశ్వరరావు సైతం బీఆర్ఎస్‌కు అంటిముట్టనట్టుగానే ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లి మండవను కలిశారు. పార్టీలో చేర్చుకున్నారు. దీంతో ఆయనకు రాజ్యసభ సీటు లేదా కీలకమైన పదవి వస్తుందని అంతా భావించారు. కానీ గడిచిన నాలుగేండ్లలో మండవకు ఎలాంటి పదవి రాకపోగా.. పార్టీలోనూ ప్రాధాన్యత కరువయ్యింది.



మండవను కలిసిన సీఎం కేసీఆర్(ఫైల్)

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నిజామాబాద్ జిల్లాలో సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్‌ను వీడుతున్నారు. ఇప్పటికే అరికెల నర్సారెడ్డి హస్తం బాట పట్టగా.. మండవ సైతం బీఆర్ఎస్ పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. నాడు లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి ఎంపీ అరవింద్ పోటీ చేయడం, కవితకు వ్యతిరేకంగా రైతులు నామినేషన్లు దాఖలు చేయడంతో కేసీఆర్ మండవను పార్టీలోకి చేర్చుకున్నారు. కానీ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు భిన్నంగా వచ్చాయి. బీజేపీ నుంచి అరవింద్ ఎంపీగా గెలుపొందారు. దీంతో మండవను సైతం దూరం పెట్టినట్టు ఆయన అనుచరు లు అభిప్రాయపడుతు న్నారు. స్వయంగా కేసీఆర్ ఆహ్వానించిన నేపథ్యంలో.. రాజ్యసభ సీటు వస్తుందని అంతా భావించారు. కానీ ఆయనకు ఎంపీతో సహా ఎలాంటి పదవీ ఇవ్వలేదు. క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న నాయకుడిని మళ్లీ రాజకీయాల్లోకి తీసుకొచ్చి పట్టించుకోలేదన్న భావన ఆయనలో, ఆయన అనుచరుల్లో ఉంది.

అరికెలకు మద్దతు?

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అరికెల నర్సారెడ్డి సిద్ధమవుతున్నారు. రూరల్‌లో మండవకు మంచి పట్టు ఉండటంతో ఆయన మద్దతుతోనే బరిలోకి దిగాలని భావిస్తున్నట్టు తెలిసింది. రూరల్‌లో మెజార్టీ ఓట్లు సెటిలర్లు ఉన్నారు. పైగా అరికెల నర్సారెడ్డికి మండవకు మొదటి నుంచి మంచి స్నేహం ఉంది. వీరద్దరూ టీడీపీ నుంచి కలిసి పని చేశారు. ఇద్దరూ వివాదారహితులుగా పేరు ఉంది. జనాల్లోనూ ఆదరాభిమానాలున్నాయి. ఈ విశ్వాసంతోనే అరికెల కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

గ్రూప్-4 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

నవతెలంగాణ-తాడ్వాయి

జూలై 1వ తేదీనా టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్ -4 పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గ్రూప్ -4 పరీక్ష ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్‌లతో జూమ్‌లో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో 40 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూట్ ఆఫీసర్లను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయిస్తామని తెలిపారు. ఇన్విజిలేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 24 మంది అభ్యర్థులు ఉండే విధంగా చూడాలన్నారు. పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, పరీక్షల విభాగం అధికారి ఎస్. లింగం, డాక్టర్ కిష్టయ్య, ఏవో రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

24/7.. నిత్య వెలుగులు

- జీపీల్లో వెలుగుతూనే ఉన్న వీధిలైట్లు
- బిల్లులు తడిసిమోపెడు

నవతెలంగాణ-మద్నూర్



పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు

సాధారణంగా వీధి దీపాలు రాత్రి వేళల్లో వెలుగుతాయి. కానీ మద్నూర్ మండలం వ్యాప్తంగా జీపీల్లో రాత్రి, పగలు తేడా లేకుండా 24/7 వెలుగుతూనే ఉన్నాయి. దీంతో జీపీలకు కరెంట్ బిల్లు తడిచి మోపెడు అవుతున్నాయి. అనవసర వేళల్లో వీధి దీపాలు వెలుగుతుండటం పట్ల ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాధనం వృథా అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో వీధిలైట్లు 24 గంటలు వెలిగితే ఆ కరెంటు బిల్లు ఎవరు భరించాలి..? ఆ భారం ఎవరిపైన పడుతుంది అనేది ఏ ఒక్కరు ఆలోచించడం లేదని విమర్శలు మద్నూర్ మండలంలో వెళ్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో పంచాయతీ అధికారులు పంచాయతీ పాలకవర్గం నిద్రావస్థలో ఉండటంతో రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటల పాటు లైట్లు వెలుగుతున్నాయని గ్రామస్తులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వీధిలైట్లు పట్ల ఇంత నిర్లక్ష్యమా..? కరెంటు చార్జీలు కట్టేది తమ డబ్బులతోనేనని, పట్టపగలు లైట్లు వెలిగించడం ఎందుకు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వీధి లైట్‌లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని కరెంట్ బిల్లులు ఆదా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బడి బయట విద్యార్థి.. బడిలో చేర్పింత

నవతెలంగాణ-లింగంపేట్



వివరాలు నమోదు చేసుకుంటున్న సీఆర్‌పీ

లింగం పేట్ మండలం లోని బాయ ంపల్లి గ్రామానికి చెందిన అంబెపు స్వర్ణ కొన్ని రోజుల నుండి పాఠ శాల కు వెళ్లలేకపోవడంతో క్లస్టర్ సిఆర్పి సంజీవులు బుధవారం వారి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేర్పించారు. స్కూల్‌కు వచ్చేందుకు మొదట మొండికేగాయ.. తల్లిదండ్రులకు బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి విద్య ప్రాముఖ్యత తెలియజేయడంతో స్కూల్‌కు వచ్చేందుకు ఒప్పుకున్నట్టు తెలిపారు. ముఖ్యంగా బాలిక విద్య ప్రాముఖ్యత తెలియజేయడంతో ఒప్పుకున్నట్టు తెలిపారు. బాలిక అక్కను ఇంటర్లో తనను 8వ తరగతిలో జాయిన్ చేస్తే చదువుకుంటానని చెప్పడంతో బాణాపూర్ పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు.

అధిక ధరకు విక్రయించొద్దు

- బిల్లులు తప్పకుండా ఇవ్వాలి
- సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్, వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్



మద్నూర్‌లో స్టాక్ తనిఖీ చేస్తున్న అధికారులు..



జుక్కల్‌లో..

ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ రేటుకు మించి అధిక ధరకు విక్రయించొద్దని వ్యవసాయాధికారులు స్పష్టంచేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని, లేకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మద్నూర్, డోంగ్లి మండలాల్లో గల ఎరువులు, విత్తన దుకాణాలను బుధవారం టాస్క్ ఫోర్స్ టీమ్ బాన్సువాడ ఏ ఓ సుధాకర్ , మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముఖ్యంగా ఎరువు డీలర్లు డీఏపి, ఇతర ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు అమ్మినట్లైతే వారి లైసెన్సులను రద్ద చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తనిఖీల్లో భాగంగా పలు దుకాణాలకు నోటీస్ లు ఇవ్వడం జరిగింది. ఎరువులు ఎక్కడి నుంచి తెచ్చారు , ఏ ఏ కంపెనీది అనేది డాక్యుమెంట్ ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఏ ఎరువులు ,ఏ విత్తనాలు అందుబాటులో ఉన్నాయో వ్యవసాయ అధికారికి తెలియజేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని స్పష్టంచేశారు. ప్రతి డీలర్లు లైసెన్స్ కాపీ, స్టాక్ బోర్డ్, బిల్ బుక్ తప్పకుండా ఉండాలని తెలియజేశారు.

నిబంధనల ప్రకారం విక్రయించాలి : జిల్లా వ్యవసాయా ధికారి వీరస్వామి

జుక్కల్ : నిబంధనల ప్రకారమే ఎరువులు, రసాయన మందులు, విత్తనాలు అమ్మకాలు నిర్వహించాలని కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామీ అన్నారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఫర్టిలైజర్ డీలర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. బిల్లులు లేకుండా అమ్మకాలు చేపట్టొద్దని, కొన్న ప్రతి రైతుకు బిల్లు తప్పక ఇవ్వాలని సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుండి తెచ్చిన ఫర్టిలైజర్స్, విత్తనాలు అమ్మకాలు చేస్తే లైసెన్స్ లు రద్దు చేసి చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల అధికారి నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ మేనేజర్‌గా సరస్వతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సరస్వతికి స్వాగతం పలుకుతున్న ఆర్టీసీ అధికారులు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ గా సరస్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ డిపో మేనేజర్ నుండి పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్‌కు డిపో 1 మెనేజర్ ఆనంద్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-భిక్కనూర్



కుటుంబీకులతో మాట్లాడుతున్న నాయకులు

భిక్కనూర్ పట్టణానికి చెందిన ఆటో యూనియన్ నాయకుడు అంబల్ల రాజమల్లు అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమల్లు ఇంటికి చేరుకొని నివాళులు అర్పించి, అంత్రక్రియల కోసం తక్షణ సాయంగా 5 వేల రూపాయల నగదును పార్టీ తరపున కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందే దయాకర్ రెడ్డి, తాటిపాముల లింబాద్రి, సిద్దా గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ తదితరులున్నారు.

ఏసీబీ వలలో ల్యాండ్ సర్వేయర్ ఏడీ

- రైతు నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏడీ, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



భూమి నాలా కన్వర్షన్ చేసిన తర్వాత పంచనామ సర్టిఫికెట్ ఇవ్వడానికి లంచం తీసుకుంటూ ల్యాండ్ సర్వేయర్ ఏడీ శ్యాంసుందర్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. నిజామాబాద్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వివరాల ప్రకారం.. మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన రాజేందర్ అనే రైతుకు సంబంధించిన భూమి నాలా కన్వర్షన్ చేసిన తర్వాత పంచనామ సర్టిఫికెట్ కోసం కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.

వివరాలు మెయిన్‌లో..

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎనలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 58 మంది లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే తన స్వంత ఖర్చులతో ప్రతి లబ్దిదారురాలికి చీరను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో రూ.15.00 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు, రూ.5.00 కోట్లతో ఆర్టీసి బస్ స్టేషన్ నిర్మాణ పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. గతంలో ఎవరు చేపట్టని పెద్ద చెరువు కట్టపై బ్రిడ్జిల నిర్మాణం అతి తక్కువ కాలంలో పూర్తి చేసి చూపించినట్టు తెలిపారు. ప్రజలకు అత్యవసరమైన డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేత

నవతెలంగాణ-భీంగల్



మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలోని ఎస్‌బిహెచ్ బ్యాంకు మేనేజర్ నరేష్, ఐకెపి సిసి పురస్తు మహిళ సంఘాలకు 1 కోటీ 11 లక్షల రూపాయల రుణాల చెక్కులను బుధవారం అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలతో ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు చిరు వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. సీసీ నరేష్ మాట్లాడుతూ.. సంఘాల సభ్యులు నెలవారీ సమావేశాలను నిర్వహించుకొని తీసుకున్న రుణాలను ప్రతి నెల సక్రమంగా చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-బోధన్



గురువారం జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా మైనార్టీలు ప్రార్థన చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని బోధన మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మైనార్టీ సోదరులు శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని వారికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, సానిటర్ ఇన్స్పెక్టర్ శంకర్ ఉన్నారు.

సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం చేయాలి

- ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- అధికారులకు వినతి

నవతెలంగాణ-సిరికొండ/భీంగల్

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కనీస వేతనం 600 రూపాయలకు పెంచాలని, 50 సంవత్సరాలు దాటిన వ్యవసాయ కార్మికులకు ఐడి కార్డులు ఇచ్చి 10 వేల జీవన భృతి, ఇండ్ల స్థలాలు కేటాయించి కేంద్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు కేజీ టు పీజీ విద్యను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. పి రామకష్ట మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వల్ల కార్మికులకు పని లేకుండా పోయిందని, వ్యవసాయ కార్మికులు పట్టణాలకు వలస వెళ్తున్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం లోనైనా పని కల్పిస్తుంది అనుకుంటే, బడ్జెట్లో కోత విధిస్తూ, కార్మికులకు అన్యాయం చేస్తుందని వాపోయారు. మహిళలకు, పురుషులకు సమాన వేతనం అందించాలని, కేంద్రం బడ్జెట్లో ఉపాధి హామీ నిధులు పెంచి కార్మికుడికి 300 రోజులు పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టం 1948లో వచ్చిన, అమలుకు నోచుకోపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ప్రత్యేక వర్గంగా గుర్తించి, వ్యవసాయ కార్మికులకు సంక్షేమ చర్యలు చేపట్టడానికి, ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ రంగంలో ఎక్కువ శాతం మహిళలు ఉన్నందున వారికి ప్రత్యేకమైన వసతులు కల్పించవలసిన ప్రభుత్వం, సమాన పనికి సమాన వేతనాన్ని రాపోయినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. వ్యవసాయ మహిళా కార్మికులు ప్రసూతి సమయంలో 6 నెలలు వ్యవసాయ పనులకు పోయే పరిస్థితులు ఉన్నందున, వారికి ఆరు నెలల పాటు పదివేల చొప్పున జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మందికి పైగా కార్మికులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ఓట్లు వేయించుకునే యంత్రాలుగానే ఉపయోగిస్తుందని ఆయన దుయ్యబట్టారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న జరిగే జిల్లా కలెక్టరేట్ల ముట్టడికి వ్యవసాయ కార్మికులు ప్రజలందరూ వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ ప్రజాపందా డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, ఏఐపీకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయిరెడ్డి, ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు ఇ రమేష్, మల్కి లింబన్న, కిషోర్, అనీష్,అయినాల రాజన్న,గంగామల్లు, నాగన్న,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్:వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం తీసుకురావాలని ఏఐకేయంఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ శ్రీధర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ప్రతి రోజు 600 రూపాయలను వేతనంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వర్, గంగాధర్, నర్సయ్య, యేసయ్య, అరవింద్ ఉన్నారు



భీంగల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గురుకులాల్లో తాత్కాలిక అధ్యాపకుల భర్తీకి డెమోల నిర్వహణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పాఠశాల, ఇంటర్మీడియెట్ స్థాయిలో బోధించడానికి తాత్కాలిక బోధన సిబ్బంది ఎంపిక కోసం వచ్చేనెల 5న ఉదయం 10 గంటల నుండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల / కళాశాల ధర్మారం, డిచ్‌పల్లి మండలం లో డెమో తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ నిజామాబాద్ రీజియన్ ఆర్‌సివోవి. మేరీ యేసుపాదం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టుల వివరాలు: జూనియర్ లెక్చరర్ (12), పిజిటి (5), టిజిటి (5), పిఇటి (2) అసిస్టెంట్ కేర్ టేకర్ (3) విద్యార్హతలు: జేఎల్, పిజిటి పోస్టులకు యుజిసి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి కనీసం 50శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పిజి డిగ్రీతోపాటు బిఇడి అర్హత కలిగి ఉండాలని సూచించారు. టిజిటి పోస్టుకు విద్యార్హతలు.. యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బిఎస్సీ / బిఎ/ బీకాం డిగ్రీ కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణతతో, బిఇడి అర్హత కలిగిఉండాలని తెలిపారు. పిఇటి పోస్టుకు వ్యాయామ విద్యలో 50శాతం మార్కులతో డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలు ధర్మారంలోగల ఆర్‌సివో కార్యాలయంలో ప్రదర్శించబడ్డాయని తెలిపారు. అసిస్టెంట్ కేర్ టేకర్ పోస్టుకు విద్యార్హతలు: గుర్తించబడిన యూనివర్సిటీ నుండి ఏదేని సబ్జెక్టులో డిగ్రీ తో పాటు బీఈడి ఉత్తీర్ణత, కంప్యూటర్ వినియోగంలో ప్రావీణ్యత. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటా ను ఒక తెల్లకాగితంపై రాసి, తమ విద్యాహర్హతల దవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జతచేసి ప్రాంతీయ సమన్వయాధికారి కార్యలయం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల / కళాశాల ధర్మారంలో దరఖాస్తులను ఈనెల 29నుండి జూలై 3వరకు సమర్పించాలని వివరించారు. గడువు తేదీలోగా దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు మాత్రమే ఆ సబ్జెక్టులో ఏదైనా ఒక నచ్చిన అంశంపై బోధనకు సిద్ధపడి, డెమో తరగతులకు హాజరుకావలసి ఉంటుందని మేరి యేసుపాదం పేర్కొన్నారు.

నగరంలోని గోడలపై మహనీయుల చిత్రాలు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో నిర్మించిన రైల్వే బ్రిడ్జి గోడలపైన స్వతంత్ర సమరయోధులు, (భగత్సింగ్, సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ, కస్తూర్బా గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్, సరోజినీ నాయుడు, జోహార్ లాల్ నెహ్రూ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, లాల్ బహుదూర్ శాస్త్రి, బాబు జగ్జీవన్ రామ్, చాకలి ఐలమ్మ కొండా లక్ష్మణరావు బాపూజీ, కాళోజి నారాయణరావు, కొత్తపల్లి జయశంకర్‌సార్) తెలంగాణ ఉద్యమకారులు చిత్రపటాలను గీసి వారి జనన, మరణాల సంవత్సరాలను, వారు చెప్పిన ఒక మంచి అంశాన్ని గోడలపై పొందుపరిచారు. ఆ చిత్రాలను నగర ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇంతటి కార్యక్రమానికి మున్సిపల్ శాఖ వారి ఆధ్వర్యంలో చిత్రపటాలను వేశారు.

కాంట్రాక్ట్ టీచర్ల బతుకులు మారాలి



మాట్లాడుతున్న టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్ల బతుకులు మారాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వి దత్తహరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రావడానికి ముఖ్య కారణం బతుకమ్మ పండుగ అని అ పండుగ త్వరలో వస్తుందని కాంట్రాక్ట్ టీచర్ల బతుకులు మారాలని పేర్కొన్నారు. దానిలో భాగంగా తెలంగాణ యూనివర్సిటీ లో కాంట్రాక్ట్ టీచర్లు అందరూ సమిష్టిగా బతుకమ్మ పండుగ జరుపుకోవడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరావు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ జోష్న, డాక్టర్ స్వామి రావు, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సురేష్, డాక్టర్ రాజేశ్వర్, జలంధర్ ,డాక్టర్ మోహన్, నాగేంద్రబాబు, గోపి రాజ్, జి శ్రీనివాస్, కిరణ్ రాథోడ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ డానియల్, డాక్టర్ గంగ కిషన్, డాక్టర్ బి ఆర్ నేత, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ప్రచార బోర్డులు ఏర్పాటు చేయొద్దు

నవతెలంగాణ -బోధన్

బోధన్ పట్టణంలో ప్రైవేటు పాఠశాలలు, ఆస్పత్రులు, కళాశాలలు బోధన్ మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా ఇష్టం ఉన్నచోట ప్రచార ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయరాదని బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రచార ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేసుకునేవారు ముందుగా టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా అనుమతి తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సి పాలిటీ వారు సూచించిన స్థలంలోనే ప్రచార బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కావున ఈ సూచనలను పాటించాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బీసీ రుణాల కోసం వెరిఫికేషన్



దరఖాస్తుదారుని వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి గ్రామపంచాయతీల పరిధిలో బీసీ రుణాల కోసం అప్లై చేసిన వారి వివరాలను వెరిఫై చేయడం కోసం ఎంపీడీవో లింగం నాయక్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ తో కలిసి బుధవారం పరిశీలించారు. ప్రతి దరఖాస్తుదారుని వివరాలను తెలుసుకుంటున్నారు. ఈసదర్భంగా ఆయన మాట్లాడుతూ వారి ఆదాయ ధ్రువీకరణ పరంగా సక్రమంగా ఉన్నవారికి కచ్చితంగా రుణాలు చెల్లిస్తారని తెలిపారు.

అభివృద్ధికి ఆటంకం కలిగించేందుకే ఆరోపణలు

- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-భీంగల్

బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆటంకం కలిగించి రాజకీయ లబ్ధిపొందేందుకే బిజెపి నాయకుడు మల్లిఖార్జున్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏర్గట్ల మండలం బట్టపూర్ గ్రామపరిసరాలలో కంకర క్వారీపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణులు చేస్తు అభివృద్ధికి ఆటంకం కలిగించాలని చూస్తున్నారని ఇదంత ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు గమనిస్తున్నారని ప్రజా క్షేత్రంలో బుద్ది చెబుతామని హెచ్చరించారు. 6500 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత మంత్రి ప్రశాంత్‌రెడ్డి దని, అదే అన్నపూర్ణమ్మ, మహిపాల్ రెడ్డిలు కూడ పాలకులుగా ఉన్నప్పుడు ఎంత అబవృద్ధిని చేశారో చూపించాలని సవాలు విసిరారు. సమావేశంలో ఎంపిపి ఆర్మూర్ మహేష్ , పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, లక్ష్మణ్, సొసైటీ చైర్మన్ నర్సయ్య నాయకులు సురెందర్, శర్మనాయక్ మరియు కార్యక్తరలు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పీవీ నరసింహారావు గొప్ప దార్శనికుడు

- తెలంగాణ రచయితల సంఘం

నవ తెలంగాణ-కంఠేశ్వర్

భారత పూర్వ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు తన దార్శనికతతో భారతదేశ ఆర్థిక పరిస్థితి చక్కదిద్ది భావి భారతానికి బంగారు బాటలు వేశాడని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. కేర్ డిగ్రీ కళాశాలలో ఈరోజు పివి నరసింహారావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవీ నరసింహారావు బహుభాషా వేత్తగా సాహిత్య సజన శీలిగా, అనువాదకుడిగా, రాజనీతిజ్ఞునిగా, అధునాతన రాజకీయ నాయకునిగా, ఆర్థిక చోధకునిగా దేశ సేవ చేశారని ఆయన నాయకులందరికీ స్ఫూర్తి అని నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు రాజకీయాలకు హుందాతనం నేర్పారని, కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన వజ్రసముడని వివరించారు. ప్రముఖ కవి పంచరెడ్డి లక్ష్మణ మాట్లాడుతూ పీవీ నరసింహారావు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంగా ఉండేవాడని ఢిల్లీ గద్దె ఎక్కిన తెలంగాణ బిడ్డగా తన ప్రత్యేకతను ఎన్నడూ విలువ లేదని తెలిపారు. ప్రముఖ కవి తిరుమల శ్రీనివాస్ ఆర్య మాట్లాడుతూ పివి నరసింహారావు తెలంగాణ ఠీవీ అని, ఆయన రాసిన గొల్ల రామవ్వ కథ ఆయన సామాజిక దక్పధానికి ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నరేశ్, సందీప్, సందేశ్ పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న రచయితలు

నాగారం బహుజన కాలనీలో వైద్యశిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకున్నట్లయితే ఆ ప్రమాదం నుండి బయటపడచ్చని ప్రముఖ డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అన్నారు. నాగారం బహుజన కాలనీలో బుధవారం నాయకులు మల్యాల గోవర్ధన్ పర్యవేక్షణలో క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీడీ కార్మికులు, ఇంటి పని వారు, రోజువారీ కూలీ పనులకు వెళుతున్న వారు ఆరోగ్యంపై అవగాహన లేని కారణంగా చిన్న వయసులోనే మరణాలకు లోనవుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలో అనేక ప్రాంతాలలో క్యాన్సర్‌పై అవగాహనతో పాటుగా టెస్టులు, వైద్యం, ఉచిత మందుల పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు కోశాధికారి ఈవీఎల్ నారాయణ అన్నారు. మారుమూల ప్రాంతమైన నాగారంలో పేదలు, బహుజనులు, అధిక సంఖ్యలో నివసిస్తున్నారని వీరు నగరానికి దూరం ఉండడంతో వైద్యానికి కూడా దూరమయ్యారని, అలాంటివారికి ఈ వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడిందని ట్రేడ్ యూనియన్ నాయకులు మల్యాల గోవర్ధన్ అన్నారు. డాక్టర్లు ,వైద్య సిబ్బంది, మహిళా సంఘ నాయకులు సుజాత అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న కాలనీ వాసులు

ధర్పల్లిలో 100 పడకల ఆసుపత్రి మంజూరు..

బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

- కేసీఆర్, బాజిరెడ్డిల చిత్ర పటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ధర్పల్లి

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి కషితో మండలకేంద్రానికి వంద పడకల ఆసుపత్రి మంజూరు అయిందని, ఇందుకు గాను 33 కోట్ల 15 లక్షల నిధులు మంజూరి తోపాటు ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తనయుడు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండలకేంద్రస్తలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టపాసులు కల్చి గ్రామంలోని ప్రధాన వీధుల్లో డీజేతో సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాజిరెడ్డి కృషితో మండల వాసుల చిరకాల స్వప్నం నెరవేరనుందని అన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ధర్పల్లిలో విద్యాభ్యాసం చేసిన గ్రామంగా ప్రత్యేక స్థానంలో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు ఆరున్నర కోట్లు మంజూరు చేశారని తెలిపారు. సీసీ రోడ్లకు గాను 60 లక్షలు, మురికి కాలువలకు మరో 15 లక్షలు మంజూరు అయ్యాయని వాటి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఆర్టీసీ చేర్మెన్ గా మండలకేంద్రంలోని బస్టాండ్‌ను తీర్చిదిద్దారని, 22 లక్షల నిధులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి న ఘనత బాజిరెడ్డిది అని అన్నారు. ఆయన తనయుడు సైతం మండల అభివృద్ధిని కోరుకుంటారని తెలిపారు. త్వరలో ఊరచెరువులో బోటింగ్, మినీ స్టేడియం రానున్నదని అన్నారు. రానున్న ఎన్నికల్లో గోవన్నను మరోసారి గెలిపించు కొని మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సొసైటీ చైర్మెన్లు చెలిమెల మల్లికార్జున్, ధర్మయ్య గారి రాజేందర్ రెడ్డి, మ్యాదారం రాజేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్ రెడ్డి, రాజ్పాల్ రెడ్డి, మనోహర్ రెడ్డి, పుప్పాల సుభాష్, కోతి శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

విద్యార్థులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న యోగగురువు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ రావు సూచన మేరకు కోటగిరి వాస్తవ్యులు యోగ గురువు వెలగ శ్రీనివాసరావు,(పాఠశాల పూర్వ విద్యార్థి) కుటుంబ సభ్యులు బుధవారం ఒక పూట భోజనాన్ని విద్యార్థులకు అందజేశారు. పేద విద్యార్థులకు అన్నదానం చేయడం శుభ పరిణామం పాఠశాల ఉపాధ్యాయుల పేర్కొన్నారు. 550 మంది విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు

రామాలయ కమిటీ ఎంపిక



రామాలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలో బుధవారం గ్రామస్తుల సమక్షంలో రామాలయ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా ఆకం కిషన్, సభ్యులుగా, నీరెడి గంగాధర్, రఘుపతి గణేష్, కమ్మరి రాఘవాచారి, బొంకెన సావిత్రితోపాటు, పూజారిని నియమించడం జరిగిందన్నారు. వారికి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కమల నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన సభ్యులు రామాలయ అభివద్ధికి కషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, స్థానిక నాయకులు రాఘవేందర్, రామ్ చందర్, గ్యాదడి సాయిలు, వివిధ కుల సంఘాల పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



వీడీసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా బాదాల సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. బుధవారం ఎన్నికలు నిర్వహించినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. వైస్ చైర్మన్‌గా ఆకు గంగారం, క్యాషియర్‌గా సూరు నీడ(మేదరి) గోపి, రైటర్‌గా వాల్గోట్ ప్రవీణ్ ను, సలహాదారులుగా చేపూరి రాజేందర్ గౌడ్, అల్లిపురం లింగం, సభ్యులుగా చిట్యాల శ్రీధర్, ఆవుసుల శ్రీనివాస్, పారి పెల్లి శివారెడ్డి, ధర్మపురి చింటూ, కుమ్మరి గంగాధర్, గ్యామ సురేష్, కురుమ మధు, గురుడు శ్రీనివాస్, గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్‌గ్గా బాధ్యతలు చేపట్టిన సంతోష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు.

నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ- బోధన్

బోధన్ మండలం సిద్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను ఫౌండేషన్ వ్యవస్థాపకులు గైని నవీన్ కుమార్ అందజేశారు అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలు పంపిణి చేశారు. కార్యక్రమంలో హెచ్.ఎం శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ అనుషబాయి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

బోరు మోటర్ బిగింపు



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కంచర్ల గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే సహకారంతో వేసిన బోరులో బోరు మోటర్ ను బిగించినట్లు సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి తెలిపారు. గ్రామాల అభివృద్ధికి, సమస్యలు పరిష్కరానికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాదవ రెడ్డి, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానంలో చేపట్టిన పాకార మండపం పనులకు శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి 100 సంచుల సిమెంట్ బస్తాలను అందజేసినట్లు ఆలయ ఈవో ప్రభువు రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. తమకు తోచిన విధంగా విరాళాలు అందజేయవచ్చని తెలిపారు.

ఏండ్లుగా ఇన్‌చార్జిలే

- విద్యాశాఖలో హెచ్‌ఎంలే ఇన్‌చార్జి ఎంఈవోలు
- జిల్లా వ్యాప్తంగా ఒక్కరే రెగ్యులర్ ఎంఈవో
- ఇన్‌చార్జిలకు సైతం నాలుగైదు మండలాల కేటాయింపు
- పాఠశాలలపై నిఘా కరువు
- ప్రభుత్వ విద్య బలోపేతం అయ్యేనా..?



నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్రంలో కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలు చేస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని ఒక వైపు పాలకులు ఊదరగొడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా కొనసాగుతుండటం గమనార్హం. స్కూళ్లను, ఉపాధ్యాయుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈవోల) పోస్టులు ఖాళీలుగా ఉండటంతో పర్యవేక్షణ లోపిస్తుంది. కామారెడ్డిజిల్లా వ్యాప్తంగా కేవలం ఒక్కరు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోగా ఉండగా.. మిగతా చోట్ల హెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ ఇన్‌చార్జి ఎంఈవోలకు సైతం నాలుగైదు మండలాలకు బాధ్యతలు అప్పగించడంతో పర్యవేక్షణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

కామారెడ్డి జిల్లాలోని 23 మండలాలోల 697 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు, 127 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, 187 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో 99,862 విద్యార్థులు చదువుతుండగా, 4,024 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 1,011 పాఠశాలలు ఉండగా.. వీటి పర్యవేక్షణకు కేవలం ఏడుగురు ఇన్‌చార్జి ఎంఈవోలే ఉండగా గమనార్హం. ఒక్కో ఇన్‌చార్జికి మూడు నుంచి నాలుగుకు మించి మండలాల బాధ్యతలు అప్పగిస్తుండటంతో అటు పాఠశాలల తనిఖీ ఉపాధ్యాయుల పనితీరు పరిశీలన చేయలేక, ఇటు కార్యాలయ నిర్వహణ, మధ్యాహ్నం భోజనం పరిశీలన చేపట్టలేకపోతుండటంతో విద్యావ్యవస్థ గాడితప్పుతుంది.

మాచారెడ్డి మండలం ఫర్దిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్యకు భిక్కనూరుకు ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. భిక్కనూర్‌తో పాటు కామారెడ్డి, దోమకొండ, బిబిపేట్, మాచారెడ్డి, మొత్తం 5 మండలాలకు ఒకే ఒక్క ఎంఈఓ ని నియమించడంతో ఏ రోజు, ఎప్పుడు, ఎక్కడ విధులు నిర్వహించాలో, ఏ పాఠశాలను పరిశీలించాలో తెలియడం లేదు. 22 మండలాలకు ఏడుగురు ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్న కారణంగా కార్యాలయ నిర్వహణ, ఉపాధ్యాయులకు అందుబాటులో లేకపోవడం, కార్యాలయానికి వచ్చిన వారికి ఎంఈఓ అధికారి లేక కాళీ కుర్చీ తో దర్శనం ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భిక్కనూర్ మండలంలో 28 ప్రాథమిక పాఠశాలలో, 5 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 187 ఉపాధ్యాయులు, 4800 మంది విద్యార్థులు ఉన్నారు. భిక్కనూర్ మండలంలో ఓ ప్రభుత్వ పాఠశాలను నవతెలంగాణ పరిశీలించగా.. పలువురు ఉపాధ్యాయులు సమయానికి రాకపోవడం, సమయం కంటే ముందే పాఠశాల నుండి వెళ్లిపోవడం కనిపించింది. రెగ్యులర్ ఎంఈవో అందుబాటులో ఉండి ఉంటే ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారని, దాంతో ఉపాధ్యాయులు సైతం సమయవేళలు పాటించే అవకాశం ఉంటుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

జిల్లావ్యాప్తంగా ఉన్న 23 మండలాలకు ఒకే ఒక్క గాంధారి ఎంఈఓ రెగ్యులర్ ఎంఈఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మిగతా 22 మండలాలకు ఇంచార్ గా ఉన్న 7 ఎంఈఓ లే బాధ్యత నిర్వహించడం ఏంటని విద్యార్థి సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై కార్యాలయానికి వెళ్తే విద్యార్థులకు, విద్యార్థి సంఘ నాయకులకు అందుబాటులో లేక కార్యాలయానికి వచ్చిన వారు నిరాశతో వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ప్రస్తుత నూతన విద్యా సంవత్సరం నుండి ప్రతి మండలానికి ఒక ఎంఈఓని నియమించి విద్యా వ్యవస్థను పటిష్టం చేసి, ప్రభుత్వ పాఠశాలలపై ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎంఈఓ కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వారికి ఎంఈఓ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతి మండలానికి ఎంఈఓని నియమించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్



ప్రతి మండలానికి ఒక ఎంఈఓని నియమించాలి. ఇన్‌చార్జిలుగా హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు ఇవ్వడంతో పని ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో పాటు ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కరువవుతుంది. విద్యాశాఖ గాడితప్పుతుంది. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి ఎంఈఓ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

2,3 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం

- విజయవంతం చేయండి : ఎస్ఎఫ్ఐ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

జూలై 2, 3 తేదీలలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ పిలుపునిచ్చారు. కామారెడ్డిజిల్లా కేంద్రంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశాలను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో రాష్ట్ర ముఖ్య నాయకత్వం పాల్గొంటుందని సమావేశాలలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని అన్నారు. కామారెడ్డి లో జరిగే రాష్ట్ర కమిటీ వేదికగా పోరాటాలు రూపొందిస్తామని అన్నారు. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్ నాయకులు అవినాష్ సచిన్ నగేష్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేసే వ్యక్తులకు సంక్షేమ పథకాలు నిలిపివేస్తాం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాద్వాయి)

గంజాయి సాగు చేసిన వ్యక్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లా నార్కోటిక్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గంజాయి సాగు చేసిన వ్యక్తులకు రైతుబంధు, బీమా, కళ్యాణ లక్ష్మి, ఆరోగ్య లక్ష్మి వంటి పథకాలను నిలిపివేస్తామని తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. డ్రగ్స్ వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి సాగు చేసినట్లు కనిపిస్తే వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర రాజు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

- ఇంజనీరింగ్ ప్రవేశాలకు విద్యార్థుల ధృవపత్రాల పరిశీలన




కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థుల సర్టిఫికేట్‌లు పరిశీలన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంజనీరింగ్ ప్రవేశ ప్రక్రియ ఎంసెట్ - 2023లో భాగంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న 564 మంది విద్యార్థుల ధృవపత్రాలను బుధవారం పరిశీలించినట్లు నిజామాబాద్ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయ కర్త సి. శ్రీరామ్ కుమార్ తెలిపారు. ధృవ పత్రం పరిశీలన జూలై 6 వరకు ఉంటుందని, ధృవ పత్రాల పరిశీలన పూర్తి అయిన విద్యార్థులు జూలై 8 వరకు కళాశాలల ఎంపిక చేసకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం వైబ్ సైట్ htts:// tseamcer.nic.inలో సందర్శించాలని తెలిపారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన స్పీకర్

నవతెలంగాణ-బాన్సువాడ



బ్యాటరీవాహనంపై తిరుగుతూ పనుల పరిశీలన

బాన్సు వాడ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతి నిధులు, నాయకులు, అధికారు లతో బుధవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలిం చారు. ముందుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కల్కి చెరువు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్ పార్క్, ఉమెన్ పార్క్, సీనియర్ సిటీజన్ పార్కలను పరిశీలించారు. అదేవిధంగా అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలించి పనులను త్వరితగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. స్పీకర్ వెంట రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి. అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమీషనర్ రమేష్, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతుకోసం

రైతుల రిలే దీక్ష

- పనులు పూర్తి చేసే వరకూ కొనసాగిస్తామని స్పష్టీకరణ



రిలే దీక్షలో పెద్దఎత్తున కూర్చున్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

రోడ్డు మరమ్మతుల చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు రిలే దీక్షలు ప్రారంభించారు. మండల కేంద్రంలో గాంధీ విగ్రహం ఎదు రైతుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెంజల్ రోడ్డు, మాచాపురం, దూపల్లి ఎక్స్ రోడ్ల మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేసి ఎనిమిది సంవత్సరాలైనా ఇంతవరకు రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయలేదని రైతులు మండిపడ్డారు. పంట పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు నోచుకోక రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని, 90 శాతం రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు ఈ రోడ్డె ఆధారమని, పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరూ ఏకమై రిలే నిరాహార దీక్షను చేపట్టినట్లు తెలిపారు. కోటి 54 లక్షల 65 వేల రూపాయల వ్యయంతో గత ఎనిమిది సంవత్సరాల కిందట మంజూరైన నిధులు సబ్ కాంట్రాక్టర్ మృతి చెందగా, రోడ్డు మరమ్మతులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని తెలిపారు. ప్రతేడాది అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువైయ్యారని అన్నారు. రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేసే వరకూ తమ రిలే దీక్ష విరమించే ప్రసక్తి లేదని వారు స్పష్టంచేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో బుధవారం సీసీ రోడ్డు పనులను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొమ్మిడి రాంరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్పు గంప గోవర్ధన్ సహకారంతో గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల క్రింద రూ 30 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని, గతంలో గంప గోవర్ధన్ సహకారంతో 75 లక్షల సిసి రోడ్డు పనులను నిర్వహించుకున్నామని తెలిపారు. గత 20 30 సంవత్సరాల నుండి ఐక్యతతో గ్రామ అభివృద్ధి చేసుకునే పేరున్న గ్రామమని, గంప గోవర్ధన్ సహకారంతో శ్రీ స్వయం బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సిసి రోడ్డు, ఐమాక్స్ లైట్, గ్రామపంచాయతీకి ట్రాక్టర్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, వంటి అనేక సంక్షేమ కార్య క్రమాలు నిర్వహించిన ఘనత కెసిఆర్ ప్రభుత్వా నికి దక్కుతు దన్నారు. పార్టీలకు అతీతంగా ఎన్నికల ప్రచారాన్ని ఈ దేవాలయం నుండి ప్రారంబి ంచడం ఆనవాయితీ గా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బొమ్మిడి రామ్ రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్, ఉప సర్పంచ్ నరేందర్, బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, యూత్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు గజ్జల శంకర్, తోట లింగం, వడ్ల లక్ష్మయ్య, బొమ్మిడి సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సహకరించాలి

- రాజకీయ పార్టీలకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి(తాద్వాయి)



ఈవీఎం మిషిన్‌ల పనితీరుపై వివరిస్తున్న కలెక్టర్

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, నమోదుకు అన్ని రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తూ పారదర్శక ఓటరు జాబితా తయారీ లో భాగస్వామ్యం కావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి ఈవీఎం గోదాంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు పటిష్టమైన చర్యలు తీసు కుంటు న్నట్లు తెలిపారు. ఈ ఏడాది శాసన సభ ఎన్నికల నిర్వహించాల్సి ఉన్నందు వల్ల రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్- 2023 పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా మరో షెడ్యూల్‌ను ప్రకటించిందన్నారు. అక్టోబర్ 1 వరకు 2023 నాటికి 18 ఏళ్ల నిండిన యువతి, యువకుల పేర్లు ఈనెల 30లోగా ఫామ్-6లో బిఎల్వోలకు అందజేయాలని తెలిపారు.

అక్టోబర్ 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగియనుందన్నారు. ఇంటింటా సర్వేతోపాటు అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయడం, డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి తొలగింపునకు దరఖాస్తులను స్వీకరించి సవరణలు చేసి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఒకే రకమైన ఫొటోలు, మరణించిన వారు, ఒకే ఓటరు వేర్వేరు చోట్ల నమోదు వంటి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అన్నారు. అనంతరం ఈవీఎంలు, వివి ప్యాట్స్ ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఫస్ట్ లెవెల్ తనిఖీలను రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించారు. బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్స్ పనిచేయు విధానాన్ని పరిశీలించారు. రాజకీయ పార్టీల నాయకుల సందేహాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఈసీఐఎల్ ఇంజనీర్స్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ వెంకట్ రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రూప్-4 పరీక్షకు విస్తృత ఏర్పాట్లు

- సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) ద్వారా జూలై 1వ తేదీన జరుగనున్న గ్రూప్-4 పరీక్ష నిర్వహణకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. గ్రూప్-4 పరీక్షలను పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్ష ఏర్పాట్ల గురించి, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు. జూలై 1వ తేదీన ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు కొనసాగే గ్రూప్-4 పరీక్షకు జిల్లాలో 39183 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. వీరి కోసం125 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. టీ ఎస్ పీ ఎస్ సీ వెబ్ సైట్ ద్వారా ఇప్పటికే అత్యధిక మంది హాల్ టికెట్ లను డౌన్ లోడ్ చేసుకున్నారని, మిగతా వారు కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమవెంట తప్పనిసరిగా ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫోటో ఆధారిత గుర్తింపు కార్డులో ఏదైనా ఒక గుర్తింపు కార్డును తేవాలని, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలని సూచించారు. సెల్ ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తేకూడదని, ఎగ్జామ్ ప్యాడ్ కు అనుమతి లేనందున వెంట తెచ్చుకోకూడదని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తనిఖీ సిబ్బంది తో పాటు ప్రత్యేకంగా మెటల్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. షులా వేసుకోకూడదని, చెప్పులు ధరించి రావాలని తెలిపారు. హాల్ టికెట్‌లో పొందుపర్చబడిన పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థులు ముందుగానే వెళ్లి పరిశీలించుకుంటే పరీక్ష రోజున ఆందోళనకు గురయ్యే పరిస్థితి ఉండదని అదనపు కలెక్టర్ హితవు పలికారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి కనీసం 15 నిమిషాలు ముందే కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయం దాటిన అనంతరం గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులంతా ఉదయం 8.00 గంటల వరకు జిల్లా కేంద్రానికి చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ డ్యూయల్ డెస్క్ టేబుళ్లు, పరీక్షా గదుల్లో తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, టాయిలెట్ ఇత్యాది వసతులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. ప్రతి కేంద్రంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్‌ను నియమిస్తున్నామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు మహిళా పోలీసు సిబ్బంది సైతం ఉంటారని, అభ్యర్థుల సహాయార్థం బస్టాండ్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా ఇన్విజిలేటర్లను నియమిస్తూ, వారికి పరీక్షల నిర్వహణ, నిబంధనలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక లైజనింగ్ ఆఫీసర్ ఉంటారని, ఆకస్మిక తనిఖీల కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తున్నామని తెలిపారు. ఎలాంటి అపశ్రుతులు, లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అభ్యర్థులు టీఎస్‌పీఎస్‌సీ నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ మధుసూదన్ రావు, ఆర్డీఓలు రవి, రాజేశ్వర్, డీఐఈఓ రఘురాజ్, జిల్లా విద్యా శాఖ అధికారి దుర్గాప్రసాద్, డీటీసీ వెంకటరమణ, చీఫ్ సూపరింటెండెంట్ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్



హాజరైన అధికారులు

నేడు మందకృష్ణ మాదిగ రాక : ఎంఆర్‌పీఎస్

నవతెలంగాణ-ఆర్మూర్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నేడు పట్టణంలోని ఎం ఆర్ గార్డెన్స్‌లో జరిగే మాదిగల జిల్లా మహాసభకు మంద కృష్ణ మాదిగ వస్తున్నారని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్ మాదిగ తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో పెట్టి మాదిగల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎంఆర్ గార్డెన్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభకు జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాలు, సబ్బండ కులాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి మంద ప్రభాకర్ నియోజకవర్గ ఇంచార్జి నాగం రాజేష్ మాదిగ, జిల్లా నాయకులు పోచంపల్లి శ్రీనివాస్ మాదిగ, జిల్లా నాయకులు కనక శ్రీధీప్ మాదిగ, సంకేపల్లీ మున్న మాదిగ, వేల్పుల శివ మాదిగ, రాష్ట్ర నాయకులు దావు ఆదిత్య మాదిగ పాల్గొన్నారు

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల దోపిడీ : టీవీయూవీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల దోపిడీ చేస్తున్నారని టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ అన్నారు. ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో 70 శాతం కన్వీనర్ కోట సీట్లను మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్పాట్ కౌన్సెలింగ్ పేరుతో కన్వీనర్ కోటా సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటూ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు అక్రమంగా దండుకుంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కానీ, విద్యాశాఖ కానీ స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రతి ఏటా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల అక్రమాలను అరికట్టాలని కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఇంజనీరింగ్ కాలేజీలు ఫీజుల దోపిడీకి పాల్పడుతూన్నాయని ఆరోపించారు. ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల అక్రమాలను అరికట్టాలని ఈ సందర్భంగా లాల్ సింగ్ డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు.

కురిసిన వర్షం.. రైతుల హర్షం

- నాట్లువేసేందుకు సిద్ధం

నవతెలంగాణ-ఎడపల్లి


ఎడపల్లిలో కురుస్తున్న వర్షం

మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురియడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు. పక్షం రోజు నుండి వర్షాలు కురియకపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురైన విషయం తెలిసిందే. బోరు బావుల వద్ద సాగునీరుపారక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రెండు రోజుల నుండి వర్షాలు కురియడంతో బోరు బావులకు నుంచి వచ్చే నేర్పు తోడు వర్షపు నీరు సహకరించడంతో పొలాలు దుక్కులు పూర్తిగా తడిపోయాయి. పైగా మడుల్లో నీరు నిలువ ఉండడంతో రైతులు సంతోష పడుతున్నారు. ఈపాటికి 25శాతం మంది రైతన్నలు వరినాట్లు వేశారు. మిగతా రైతన్నలు దమ్ములు కొడుతూ వరి నాట్లు వేయిస్తున్నారు. మండలంలోకి బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు అధిక సంఖ్యలో రావడంతో స్థానిక కూలీలకు పని లేకుండా పోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీహార్ కూలీలు మగవారు అయినప్పటికీ ఎకరానికి 4వేల రూపాయలు మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిసింది. స్థానిక మహిళా కూలీలు 3500 రూపాయలకే ఎకరానా నాట్లు వేస్తున్నట్లు వినికిడి. ఏది ఏమైనప్పటికీ మూడు రోజుల నుండి వర్షాలు కురియడంతో వారినట్లు జోరుగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కూలీలకు కూడా కూలి రేట్లు పెరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వర్షాలు ఇలాగే రోజువారిగా కురిసినట్లయితే జులై చివరి వరకు వరి నాట్లు పూర్తయితాయని రైతన్నలు అంటున్నారు. వర్షాలు మరింత సమృద్ధిగా పడాలని రైతులు కోరుతున్నారు. బోరు బావులే ఉన్నచోట వరి నారు ముదిరిపోయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో రైతన్నలు అదేనారును వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు
- తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పేదప్రజలు ప్రభుత్వ స్థలాలలో వేసుకున్న గుడిసెలకు ఇల్లా పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అన్నారు. సిపిఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పట్టణ తహసీల్దార్ కార్యాలయం ముందు పేదలు ప్రభుత్వ స్థలాల్లో వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బుధవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రమేష్ బాబు, ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం నిరుపేదలకి ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని అన్నారు గత ప్రభుత్వాల పాలనలో పిట్టగూళ్లలెక్క ఇండ్లు ఉన్నాయని, మా ప్రభుత్వం 125 గజాలలో డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇస్తామని 10 సంవత్సరాలు చెబుతున్నారని తెలిపారు. నిరుపేద ప్రజలు ఆర్థిక భారం అధికమై ఇల్లు కిరాయి కట్టలేక, పిల్లలను చదివించుకోలేక పెరుగుతున్న ధరలను తట్టుకోలేక ప్రభుత్వ స్థలాల్లో నిల్వ నీడ కోసం ఆరు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. అక్కడ ప్రభుత్వం ఇప్పటివరకు మౌలిక వసతులు కల్పించలేదని, పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. అక్కడ ఉంటున్న పేద ప్రజలకు వెంటనే పట్టాలిచ్చి ఇల్లు కట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ఏరియా కమిటీ సభ్యులు కుతాడి ఎల్లయ్య, తొగటి భువనేశ్వర్, సదమస్తుల అశోక్, భామండ్ల రవి, పార్టీ సభ్యులు రాజన్న, కుల్దీప్ శర్మ, సాయిలు, రాజు, రమేష్ , నవీద్ ,సాజిద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ప్రముఖుల బక్రీద్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు-భవనాలు, ం-గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లా అన్ని రంగాలలో మరింత అభివద్ధి సాధిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతత్వం, సుహృ-ద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కామారెడ్డి డీఆర్‌డీఏ పీడీ సాయన్న
- ఆర్థిక అక్షరాస్యత పై శిక్షణ ముగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


సీఏలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న డీఆర్డిఏ పిడి

మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఎస్బిఐ అర్ఎస్ఈటిఐ) లో ఆరురోజుల ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్డిఎ పిడి కామారెడ్డి సాయన్న హాజరై శిక్షణను పూర్తి చేసుకున్న కామారెడ్డి జిల్లాకు చెందిన 70 మంది సీఏలకు సర్టిఫికెట్స్, పుల్ కిట్స్‌ను అందజేశారు. శిక్షణార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని, అలాంటి వారందరికీ సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్‌ను ప్రతి ఒక్కరూ సద్వి నియోగ పరచుకొని సంఘం సభ్యులకు శిక్షణ లో నేర్చుకున్న విషయాలను ఇతరులకు తెలిపే విధంగా చూడాలని సూచించారు. అనంతరం హరితహరంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో సెర్ప్ వెంకట్,డిపిఎం రవీందర్, సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, నవీన్, భాగ్యలక్ష్మి, రాముకష్ణ, రంజిత్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

తినుబండారాలు బలవంతంగా అమ్మించొద్దు


మాట్లాడుతున్న బీడి వర్కర్స్ యూనివన్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తినుబండారాలు బలవంతంగా అమ్మించవద్దు అని తెలంగాణ ప్రగశీల బీడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు భూమన్న, కార్యదర్శి సూర్య శివాజీ అన్నారు ఐఎఫ్‌టీయూ కార్యాయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డివిజన్ పరిధిలో గల నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాలలో కామారెడ్డి డివిజన్ పరిధిలో గల కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట్ జిల్లాల్లో బీడీ కార్మికులకు ఈ మధ్యకాలంలో తమ కంపెనీ అయిన దేశాయ్ బ్రదర్స్ లిమిటెడ్ కు చెందిన పితార ప్రొడక్ట్ తినుబండారాలు ఆలూ చిప్స్, నమ్కీన్, మురుమురే, కురుకురే, బుజియ, మూంగ్‌దాల్, గ్రీన్ పీస్ ఇలా ఇతరత్రా తినుబండారాలు ప్రతి నెల బలవంతంగా ఇచ్చి విక్రయించాలని చెబుతున్నారని తెలిపారు. వాటి డబ్బులు కార్మికుల బట్వాడాలో తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇది చట్ట వ్యతిరేకమైనది అని, కార్మికుల పై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. బీడీ కార్మికులతో తినుబండారాల విక్రయాలు వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తప్పవన్నారు. కార్యక్రమంలో హరిత భూమన్న, శివకుమార్, కాజా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

టెలి పెర్ఫార్మెన్స్ హెచ్‌ఆర్ లీడర్ మనమ్మాయే

- కేటీఆర్ అభినందనలు అందుకున్న బందంలో భలేరావ్ స్వాతి


స్వాతిని అభినందిస్తున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ డిజిటల్ బిజినెస్ సేవల సంస్థ టెలి పెర్ఫార్మెన్స్ హెచ్‌ఆర్ లీడర్ గా కమ్మర్‌పల్లికి చెందిన భలేరావ్ స్వాతి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ అభినందనలు అందుకున్నారు. రెండు రోజుల క్రితం తెలంగాణలో క్యాంపస్‌ను ప్రారంభించేందుకు టెలి పెర్ఫార్మెన్స్ సంస్థ ప్రతినిధులు కేటీఆర్‌ను కలిశారు. క్యాంపస్ ఏర్పాటు తమ పెట్టుబడుల గురించి మంత్రితో చర్చించారు. మొత్తం మూడు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వచ్చే నెలలో క్యాంపస్ ను ప్రారంభించాల్సిందిగా ఆహ్వానం అందించేందుకు సంస్థ ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ బందం హెచ్‌ఆర్ లీడర్ గా కమ్మర్ పల్లి మాజీ సర్పంచులైన భలేరావ్ రాజేశ్వర్ మైథిలి దంపతుల కూతురు భలేరావ్ స్వాతి ఉన్నట్లు తెలుసుకున్న కేటీఆర్ స్వాతిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రముఖ సంస్థ హెచ్‌ఆర్ లీడర్‌గా గ్రామానికి చెందిన అమ్మాయి ఉండడం గర్వకారణమని పేర్కొంటూ స్వాతి స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన ఈరపట్నం రాములు అనారోగ్యంతో చికిత్స చేయించుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా స్పందించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రాములుకు 3 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం నేరుగా ఇంటికి పంపడంతో ఆయన కుటుంబం మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు సున్నపు అంజయ్య, నాయకులు బద్దం ప్రభాకర్, దేవుడు నర్సయ్య,ఈరపట్నం నరేష్, కుమ్మరి సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్‌బీ

నవతెలంగాణ - బోధన్


మాట్లాడుతూన్న ఏఐఎస్‌బీ నాయకులు నాగరాజు

విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకులు నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పాఠశాలలు మొదలైనప్పటి మకి పాఠ్యపుస్తకాలు అందకపోవడం సిగ్గుచేటుమని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ స్కూళ్లలో వర్షాకాలం సందర్భంగా బిల్డింగ్స్ మరమ్మతులు చేపట్టాలని, స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బోధన్ డివిజన్లో గల ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల పేరుతో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని , పాఠ్యపుస్తకాలు బుక్స్ ల కోసం వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, ప్రయివేట్ పాఠశాలలోనే బుక్స్ కొనాలని నిబంధనలు పెట్టే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు. టై, బెల్టు, బ్యాడ్జ్ లాంటివి అమ్ముతూ అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. అడ్మిషన్ ఫీజు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టరీతిన వసూలు చేస్తున్నారని, కొన్ని విద్య సంస్థలలో క్వాలిఫికేషన్ లేని టీచర్లతో విద్యను బోధిస్తున్నారని, కావున ప్రభుత్వ విద్య ఉన్నత అధికారులు స్థానిక అధికారులు ఫీజులపై సర్వే చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు విద్యా సంస్థలలో విద్య హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజన్న, సతీష్, శీను, గంగ ప్రసాద్, రాకేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

532లో పట్టాలిచ్చినా అడ్డుకోవడం శోచనీయం

నవతెలంగాణ-సిరికొండ


వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ ఎంఎల్ నాయకులు

హైకోర్టు తీర్పును ఉల్లంఘించిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. 532 సర్వే నెంబర్ లో 166 మందికి పట్టాలిచ్చిన విషయం అందరికీ తెలిసిందేనని, అయినా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం శోచనీయమని అన్నారు. అప్పటి కలెక్టర్ రామాంజనేయులు స్వయాన సర్వేలో పాల్గొని ఇది రెవెన్యూ భూమి అని తేల్చిన తర్వాత పట్టాలు ఇచ్చిన భూములోకి పోనీ వ్వకపోవడం ఫారెస్ట్ అధికారుల అతి ఉత్సాహం తప్ప మరొకటి కాదని అన్నారు. హరితహారం పేరు మీద భూములు లాక్కోవడం తప్ప కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. గతంలో నాలుగు ఐదు సార్లు జాయింట్ సర్వే చేసిన, ఇది రెవెన్యూ భూమి అని తేలినప్పటికీ కూడా ఫారెస్ట్ అధికారులు సంతకాలు చేయకుండా తప్పించుకు తిరుగుతున్నారే తప్ప భూ సమస్య పరిష్కారం చేయడం లేదదన్నారు. ఇప్పటికైనా పోడు భూములలో భాగంగా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వీరికి, డిజిటల్ పాస్ బుక్కులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి రెడ్డి, రమేష్, కిషోర్, అనీష్, అఫ్రోజ్, భూబాధితులు నాగయ్య, గంగన్న, గంగాధర్, లింగం, సితాయిపేట్ గంగవ్వ, జహీరాబి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

- ప్రముఖ చాతి వైద్య నిపుణులు బొద్దుల రాజేంద్రప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్


రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానం ప్రాణదానమని ప్రముఖ ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జమాల్పూర్ విఠల్ వ్యాస్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో బుదవారం జర్నలిస్టు విఠల్ వ్యాస్ తృతీయ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ రెడ్ క్రాస్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ హాజరై ప్రసంగించారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూమూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న సొసైటీ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా 10 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జమాల్పూర్ రాజశేఖర్, ఆర్ అండ్‌బి డీఈ శ్రీమన్నారాయణ, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బైర శేఖర్, టియూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొబ్బిలి నర్సయ్య, లయన్స్ క్లబ్ కార్యదర్శి చింతల గంగాదాస్, సొసైటీ గౌరవాధ్యక్షులు జమాల్పూర్ గణేష్, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జమాల్పూర్ రాజశేఖర్, జమాల్పూర్ ఈశ్వర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బిఎడ్ కళాశాలలు ఎన్సిటిఈ నిబంధనలను పాటించడం లేదు

- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు
- బీఎడ్ కళాశాలలకు సందర్శన

నవతెలంగాణ-బోధన్


కళాశాలలపై మాట్లాడుతూన్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న బీ.ఎడ్ కళాశాలలను బుధవారం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల సెంట్ థామస్ బీఎడ్ కళాశాలను పరిశీలించి మాట్లాడారు. బీఎడ్ కళాశాలలు ఎన్‌సిటిఈ నిబంధనలను పాటించాలని అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఉన్న చాలా కళాశాలలో ఎన్సిటిఈ నిబంధనలను బిఎడ్ కళాశాలలు పాటించడం లేదని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండకపోవడాన్ని గమనించామని తెలిపారు. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులకు 10 నెలల వేతనాలను మాత్రమే ఇస్తున్నారని 12 నెలల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిబంధనలను పాటించని కళాశాలలకు 2023-24 విద్యా సంవత్సరానికి అనుమతులు ఇవ్వరాదన్నారు. కొన్ని కళాశాలలో అర్హత లేని అధ్యాపకులు ప్రిన్సిపాళ్లు ఉన్నారని, వారిని తొలగించి అర్హులైన వారికి నియమించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సచిన్, జహీరాబాద్ పార్లమెంటరీ ఇంచార్జ్ అంజల్ రెడ్డి పాల్గొన్నారు.

టీయూలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని కోరుతూ పిడిఎస్ తెలంగాణ యూనివర్సి టీ కమిటీ ఆధ్వర్యం లో యూని వర్సిటీ రిజిస్ట్రార్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజే శారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, జయంతి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ లేక, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఫీజులు కట్టలేక నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల విద్యార్థులు ఇంజనీరింగ్ విద్య కోసం హైదరాబాద్ ఇతర పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటు న్నారని తెలిపారు. గతంలో ఇంజనీరింగ్ కాలేజ్ నిజామాబాద్‌లో పెడతామని పాలకులు హామీ ఇచ్చారని, పేద విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ సాయి, అక్షయ్ మణికంఠ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారతదేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 101వ జయంతితి పురస్కరించుకొని బుధవారం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు నిజామాబాద్ ఆధ్వర్యంలో వినాయక్ నగర్‌లోగల బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కిరణ్ దేశ్ ముఖ్, గౌరవ అధ్యక్షులు కంజర్కర్ భూపతి రావు మాట్లాడుతూ.. బహుముఖ ప్రజ్ఞాశాలీ బహు భాషా కోవిదుడు అపర చాణక్యుడు పీవీ నరసింహారావు భారతదేశ ఆర్థిక వ్యవస్థను బ్రహ్మాండంగా నిర్వర్తించిన గొప్ప మేధావి అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం పీవీ నరసింహారావు కి వెంటనే భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంగం కోశాది కారి రమేష్ కులకర్ణి, పుల్కల్ సభ్యులు లక్ష్మి నారాయణ భరద్వాజ్, అప్పల కిష్టయ్య, కోస్లీ చంద్రశేఖర్, వాస్తు సుధాకర్, జయంత్, జగపతిరావు, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BODHAN.

O.S.NO. 145 OF 2020

Between:-Smt.Kotagiri Jayamma.
Plaintiff

AND

1. Sri.Peta Eshwar
2. Sri.Kotagiri Naveen

Defendants

To

K.Naveen son of K.Shankar, Age: 35 years, Occupation: Nil, R/o H.No.1: 1-1319, Rakasipet area, within the limits of Bodhan Municipality, Bodhan Town, Dist.Nizamabad the General public instructions of my client Smt.K.Jayamma w/o Shankar R/o Rakasipet Bodhan Town.Take notice that above suit OS.No.145 of 2020 on the file of Principle Junior Civil Judge at Bodhan filed for declaration in respect of residential house bearing MunicipalNo.1-1-1095 situated Rakasipet Bodhan Town against one P.Eshwar and you. That you are keeping out of way and avoiding service and your where abouts are not known and last resided at Rakasipet Bodhan Town and summons are can not be served by ordinary way. Therefore the Hon'ble Court passed orders for service of summons by an advertisement. The above case is posted on 08-08-2023. Therefore you are hereby called up on through this publication to appear before above Court on 08-08-2023 at 10:30am in person or through Advocate or agent to answer the claim, failing which matter will be decided in your absence on merits.

//BY ORDER OF THE COURT//

**C. GOPAL REDDY
ADVOCATE
H.No. 4-2-189/a1, Anil Talkies Road, Opp: Laxmi Apartment,
BODHAN TOWN
Dist. Nizamabad T.S.
9440345659.**

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT NIZAMABAD.

S.O. P. No. 8 OF 2023

Between:
Sri. Mallepula Durgaiah S/o. Late.Narayana aged about: 58 years, occ: Labour, R/o. H.No.3-93/2, Renjal vilage, Renjal mandal, Nizamabad District, Telangana-503235. Cell No.8501817567.
...Petitioner

And

1. The Asst Commissioner,Office of Employees Provident Fund Origination, Sub Regional office, at Nyalkal Road,Nizamabad.
2. To Whom So Ever it may concern.

...Respondent

TO, (R2)
2. To Whom So Ever it may concern.

Whereas the above named petitioner filed the above O.P for grant of SUCCESSION CERTIFICATE to claim the death benefits of his deceased mother by namely Smt. K.Laxmi Bai for Rupees 39,500/- from the P.F Office,Nizamabad, In respect of the deceased mother Smt. K.Laxmi Bai W/o Late Narayana R/O H.No.3-93/2, Renjal village and mandal, Nizamabad District.

Take notice that the above O.P is posted for appearance on **14-7-2023** at 10.30am.If any person having any objections; any claim in this regard may appear before this honorable court and put forth their objections with relevant documentary proof. Otherwise the matter will be decided on merits.

//By orders of the court //

**G .RAMESH,
BASA PAVAN PRASAD.
CELL.9985574766,**

IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE, NIZAMABAD.

S.O.P.NO. 15 OF 2023

Between:-
KatkamNarsaiah
Petitioner

And

The Asst. provident fund commissioner and another...
Respondents

To,

WHOM SO EVER IT MAY CONCERNT

That the Petitioner filed above S.O.P. for grant of succession certificate to withdraw the P.F. claim amount in respect of Late Katkam Gouri Bai @ Katkam Laxmi, W/o Late Katkam Ganesh, R/o Basheerabad village, Mdl: Kammarpally, Dist: Nizamabad.

Whereas the above S.O.P. is posted for your appearance on 02-08-2023 at10-30 A.M. If any person having any claim over it, appear before the Hon'blecourt, failure of which the case will be heard and decided exparte.

(BY ORDER OF THE COURT)

**G . NARAYAN DAS
ADVOCATE AND NOTARY
NIZAMABAD.
CELL NO. 94407 43423**